క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కుమార షష్టి


అలంకరణలో సుబ్రహ్మణ్య స్వామి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధిలో ఉమాజఠలేశ్వరస్వామి దేవాలయంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం కుమార షష్టి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అశ్వినికుమార్, మహేష్, ఆదిత్య ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అనంతరం అలంకరణ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రక్తదాతలే ప్రాణదాతలు


రక్తదానం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: రక్తదాతలే ప్రాణదాతలని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షురాలు డాక్టర్ పైడి సింధూర అన్నారు. మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం లయన్స్ బ్లడ్ బ్యాంకు ప్రాంగణంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తం కొరత కారణంగా ఎంతో మంది మృత్యువాత పడుతున్నారని చెప్పారు. సామాజిక బాధ్యత, మానవతా దృక్పథంతో ఆలోచించి స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకురావాలని పిలుపునిచ్చారు. అనంతరం రక్తదాతలు, గాయత్రీ కళాశాల విద్యార్థులకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ప్రతినిధులు నటుకుల మోహన్, రామ్‌గోపాల్, పాడుగు చరణ్, శాంతి, బ్లడ్ బ్యాంకు మేనేజర్ కొంతం సునీల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా పైడి


పైడి వేణుగోపాలం

శ్రీకాకుళం న్యూకాలనీ: భారతీయ జనతా పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా శ్రీకాకుళం జిల్లాకు చెందిన పైడి వేణుగోపాలం నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 25మంది కౌన్సిల్ సభ్యులను నియమించగా శ్రీకాకుళం పార్లమెంట్ తరఫున వేణుగోపాలంను నియమించారు. త్వరలో జరగబోయే బీజేపీ జాతీయ అధ్యక్షుని ఎన్నికలకు జాతీయ కౌన్సిల్ సభ్యులు ఓటుహక్కు కలిగి ఉంటారు. వేణుగోపాలం నియామకం పట్ల ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

5న మండల సర్వసభ్య సమావేశం

జి.సిగడాం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 5న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మీసాల సత్యవతి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులంతా పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

పనిచేసిన వారికి గుర్తింపేది?

- టీడీపీ ఆవిర్భావం నుంచి ఉన్నా ప్రయోజనం శూన్యం
- నగర అధ్యక్ష ఎంపిక ప్రక్రియపై క్యాడర్ అసహనం

శ్రీకాకుళం: నగరంలో పార్టీ ఆవిర్భావం నుంచి పక్కచూపులు లేకుండా పనిచేసిన వారికి గుర్తింపు ఎక్కడుందని క్యాడర్ బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. నగర పార్టీ అధ్యక్షుని ఎన్నికపై శాసనసభ్యుడు ప్రకటించకపోవడాన్ని వారంతా చర్చించుకుంటున్నారు. రేసులో మాదారాపు వెంకటేష్, పాండ్రంకి శంకర్, కోరాడ హరిగోపాల్, ఉంగటి రమణ, ఇప్పిలి తిరుమలరావు, దొండపాటి నవీన్ ఉన్నారు. వీరిలో పాండ్రంకి శంకర్ మినహా మిగిలిన వారంతా 1983లో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని ఏర్పాటు చేసినప్పటినుంచి పార్టీలో కొనసాగుతున్నవారే. వెంకటేష్, హరిగోపాల్, తిరుమలరావులు ఎన్టీఆర్ సినీ నటుడిగా ఉన్నప్పటి నుంచి అభిమానులుగా ఉన్నారు. పాండ్రంకి శంకర్ ప్రజారాజ్యం పార్టీ పుట్టినప్పుడు అందులో చేరిపోయారు. మళ్లీ తెలుగుదేశంలో చేరినప్పటికీ అంత చురుగ్గా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనలేదన్నది పార్టీ క్యాడర్ గుర్తు చేస్తున్నారు. ఇదే విషయాన్ని పార్టీ శాసనసభ్యుని దృష్టికి తీసుకెళ్లినా ఆయన పాండ్రంకి శంకర్ వైపే మొగ్గుచూపుతూ వచ్చారు. ఆయన పేరును ప్రకటిస్తారనుకున్న సమయంలో ఓ కేసులో ఇరుక్కోవడంతో శాసనసభ్యుడు మనసు మార్చుకుంటారని ఆశావాహులు భావించారు. ఐతే ఎమ్మెల్యే అధిష్టానంతో మాట్లాడి వస్తానని విజయవాడ సమావేశానికి వెళ్లినప్పుడు.. తిరిగి వచ్చిన తర్వాత కూడా అధిష్టానం కూడా పాండ్రంకి శంకర్ పేరునే ఖరారు చేసేలా ఉందని చెప్పడంతో ఆశావాహులు తీవ్ర నిరాశకు గురయ్యారు. నేతలంతా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపునిస్తుందని ప్రకటనలు చేస్తున్నారని, తమ పరిస్థితి చూస్తే వాస్తవంగా కనిపించడం లేదని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్టీ పరిశీలకులు ఇటీవల అభిప్రాయ సేకరణకు వచ్చినప్పుడు కూడా 1983 నుంచి పార్టీ కోసం కష్టపడి చేసిన వారికి గుర్తింపునివ్వాలని కోరినప్పటికీ పెడచెవిన పెట్టడం పట్ల వారంతా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే మూడు సార్లు నగర పార్టీ అధ్యక్షునిగా వ్యవహరించిన మాదారాపు వెంకటేష్‌ను జిల్లా కార్యవర్గంలోకి తీసుకోవాలని అధిష్టానం సూచించినట్టు భోగట్టా.

అరకొర బస్సులతో అవస్థలు

- సకాలంలో విద్యాసంస్థలకు చేరుకోలేకపోతున్న విద్యార్థులు
- సామాన్య ప్రయాణికులకూ తప్పని పాట్లు
- హామీలకే పరిమితమైన నేతలు


జి.సిగడాం గెడ్డకంచరాం- రాజాం బస్సు కోసం బారులు తీరిన విద్యార్థులు


బస్సు కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు

జి.సిగడాం : గ్రామీణ ప్రాంత ప్రజలకు, విద్యార్థులకు మెరుగైన ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ఎన్నికల ముందు ఊదరగొట్టిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక మాటతప్పారు. ప్రయాణికులకు తగ్గట్లుగా బస్సులు లేకపోయినా పట్టించుకునే వారే కరువయ్యారు. ముఖ్యంగా విద్యార్థులు ఉదయం, సాయంత్రం సకాలంలో గమ్యస్థానాలకు చేరుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కిక్కిరిసిన బస్సులు ఎక్కే ప్రయత్నంలో ప్రమాదకర ఫీట్లు చేస్తున్నారు.

రోజూ ఇబ్బందులే..

జి.సిగడాం మండలంలో 31 గ్రామ పంచాయితీలు, 43 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. వీటిలో చెట్టుపాదిలాం.మధుపాం, బాతువ, పున్నాం, జాడ, జగన్నాథవలస, వెంకయ్యపేట, పెంట, నాగులవలస, వీఆర్‌పేట, సీతంపేట, నక్కపేట, టంకాల దిగ్గువలస, నిద్దాం, అద్వానంపేట తదితర గ్రామాలకు ఎటువంటి బస్సు సౌకర్యం లేదు. మండలంలో సుమారు 2 వేల మందిపైగా శ్రీకాకుళం, పొందూరు, రాజాం, చీపురుపల్లి వంటి చోట్ల చదువుతున్నారు. వీరిలో 500 మంది వరకు ఆర్టీసీ బస్సు పాసులు కలిగి ఉన్నారు. సరిపడా బస్సులు లేక వీరు ప్రతి రోజు కాలేజీ, స్కూళ్లకు సకాలంలో వెళ్లలేక అవస్థలు పడుతున్నారు. జి.సిగడాం, గెడ్డ కంచరాం, ఎందువ, ఎస్.పి.ఆర్‌పురం మీదుగా ఒకే ఒక్క బస్సు సర్వీసు ఉంది. అది కూడా ఎప్పుడు వస్తుందో లేదో తెలియని పరిస్థితి. గతంలో శ్రీకాకుళం నుంచి పొందూరు, పాగిరి, జి.సిగడాం, జాడ వెంకయ్యపేట, జగన్నాథవలస మీదుగా చీపురుపల్లి బస్సు సర్వీసు ఉండేది. శ్రీకాకుళం నుంచి పొందూరు, మధుపాం, చెట్టుపొదిలాం, బాతువ మీదిగా చీపురుపల్లి బస్సు సర్వీసు కూడా నడిపారు. వీటిని రద్దు చేయడంతో ప్రయాణికులు, విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

వినతిపత్రాలు అందించినా..



మారుమూల గ్రామాల విద్యార్థులు సకాలంలో విద్యాసంస్థలకు వెళ్లాలంటే ఇబ్బందిపడుతున్నారు. సరిపడా బస్సులు లేక అవస్థలు పడుతున్నారు. కలెక్టర్, సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందించినా ఫలితం లేకపోయింది.

– బూటు హరిబాబు, బాతువ, జి.సిగడాం

సర్వీసు పునరుద్ధరించాలి..



శ్రీకాకుళం డిపో నుంచి పొందూరు, చెట్టుపొదిలాం, జి.సిగడాం, ఎందువ, బాతువ మీదుగా గతంలో బస్సు నడిచేది. అనంతరం రద్దు చేశారు. దీంతో ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సర్వీసును పునరుద్ధరించాలి.

– వాన ప్రమీల, మాజీ సర్పంచ్, ఎందువ

అధికారులు స్పందించాలి..



మారుమూల గ్రామాల విద్యార్థులు పట్టణాల్లో ఉన్నత చదువులకు వెళ్లేందుకు బస్సులు లేక అవస్థలు పడుతున్నారు. గతంలో జి.సిగడాం మండలానికి ఐదు బస్సులు వచ్చేవి. ప్రస్తుతం గెడ్డకంచరాం తప్ప ఏవీ అందుబాటులో లేవు. అధికారులు స్పందించి బస్సులు వేయాలి.

–కంది రమాదేవి, సర్పంచ్, ఎస్.పి.ఆర్.పురం

బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం


ఉపాధ్యాయులను సత్కరిస్తున్న కొత్తపెంట గ్రామస్తులు

జి.సిగడాం : కొత్త పెంట హైస్కూల్లో ఎనిమిదేళ్ల ఉత్తమ సేవలు అందించి బదిలీపై వెళ్తున్న ప్రధానోపాధ్యాయుడు మజ్జి మదన్‌మోహన్, కోనా నారాయణప్పడు, గిరిజాల చంద్రరావులను మంగళవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్యను 110 నుంచి 165కు చేరడంలో వీరి కృషి వెలకట్టలేనిదన్నారు. యూపీ నుంచి హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేశారన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. కార్యక్రమంలో ఎంఈఓలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు, సర్పంచ్ పున్నాన సోనియా, ఎంపీటీసీ మక్క శ్రీలత, ప్రధానోపాధ్యాయులు రవి, భానోజీరావు, మక్క సురేష్‌కుమార్, విశ్రాంత మేనేజర్ మక్క పెద్ద అప్పలనాయుడు, పున్నాన అక్కలనాయుడు, ఉప సర్పంచ్ యు.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవతల ఉత్సవాలు ప్రారంభం

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూడిజగన్నాథపురం గ్రామంలో పెద్దమ్మతల్లి, మంకినమ్మ, భూలోకమ్మ తల్లి గ్రామ దేవతల ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమైయ్యాయి. ఉదయం గ్రామ పెద్దలు దేవర తెచ్చే కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. తొలి రోజు మహిళల కోలాట నృత్యాలతో పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవార్లకు ముర్రాటలతో చల్లదనం చేపట్టారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. గ్రామ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మరో రెండు రోజులు ఉత్సవాలు జరగనున్నాయి.

వైభవంగా హీరాపంచమి వేడుకలు


పల్లకిలో లక్ష్మీదేవి ఊరేగింపు


గుజరాతిపేటలో మత్స్యావతారంలో జగన్నాథుడు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని జగన్నాథస్వామి ఆలయాల్లో రథయాత్ర ఉత్సవాలలో భాగంగా మంగళవారం హీరాపంచమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఇలిసిపురంలో ఒడిశా సంప్రదాయం ప్రకారం మహాలక్ష్మీదేవిని బొందిలీపురంలోని ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామి వారిని పిలుపు చేసే కార్యక్రమం నిర్వహించారు. గుజరాతిపేటలోని జగన్నాథ స్వామి ఆలయం వద్ద కూడా హీరాపంచమి వేడుకలు ఘనంగా జరిగాయి.

అవతారం వైభవం..

గుజరాతిపేటలోని జగన్నాథ స్వామి ఆలయం వద్ద స్వామివారు మంగళవారం మత్స్యావతారంలో అలంకరించారు. అర్చకులు పెంట సోదరులు ఆధ్వర్యంలో స్వామివారిని దర్శించుకున్నారు. పాండ్రంగి వీధిలోని రామాలయంలో స్వామివారు కాళీయ మర్దనుడిగా స్వామిని అలంకరించారు. అర్చకులు ప్రదీప్, ధర్మకర్త నరసింహమూర్తి ఆధ్వర్యంలో భక్తులు దర్శించుకున్నారు. మొండేటి వీధిలోని షిరిడి సాయి సేవా సంఘం ఆధ్వర్యంలో లలితా సహిత శివకామేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో నిర్వహిస్తున్న జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాలలో భాగంగా స్వామివారిని లక్ష్మీనరసింహస్వామిగా అలంకరించారు.


మొండేటివీధిలో లక్ష్మీ నరసింహస్వామిగా..


పాండ్రంగివీధిలో కాళీయ మర్దనుడిగా..

పచ్చిరొట్ట ఎరువు పంటకు బలం


సేంద్రియ ఎరువుల తయారీని పరిశీలిస్తున్న ఏడీ భవానీశంకర్

ఇచ్ఛాపురం రూరల్: పచ్చిరొట్ట ఎరువు పంటకు బలాన్ని ఇస్తుందని వ్యవసాయశాఖ ఉప సంచాలకులు టి.భవానీ శంకర్ అన్నారు. కొళిగాం, కీర్తిపురం, పాయితారి పంట పొలాలను మంగళవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువు సేద్యంతో మట్టిలో కార్బన్ శాతం పెరుగుతుందని, నేల ఉత్పాదకత మెరుగుపడేందుకు ఉపయోగపడుతుందన్నారు. పాయితారిలో సేంద్రియ ఎరువుల తయారీ విధానాన్ని పరిశీలించారు. మండల వ్యవసాయాధికారి పి.పి.వి.వి.అజయ్‌కుమార్, వ్యవసాయ సహాయకులు ఉన్నారు.

సమ్మె చేస్తున్నా పాలకులకు పట్టదా?

- సమస్యలపై స్పందించకపోవడం దారుణం
- మున్సిపల్ వర్కర్లకు మద్దతు ప్రకటించిన వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎం.వి.పద్మావతి


మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు మద్దతుగా మాట్లాడుతున్న ఎం.వి.పద్మావతి

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): మున్సిపాలిటీకి ఆయువుపట్టు లాంటి విభాగాల బాధ్యతలు మోస్తున్న కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది 50 రోజులుగా సమ్మెలో ఉన్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేకపోవడం శోచనీయమని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి అన్నారు. శ్రీకాకుళం నగరంలోని కార్పొరేషన్ కార్యాలయం వద్ద మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల దీక్షా శిబిరాన్ని మంగళవారం సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీటి సరఫరా, కల్వర్టుల నిర్మాణం, వీధి దీపాల నిర్వహణ, కంప్యూటర్ ఆపరేటర్లు, ట్యాక్స్ వసూలుచేసే సిబ్బంది తదితర కార్మికులు సమ్మెలో ఉండటంతో పాలన స్తంభించిపోయినా ప్రభుత్వం చర్చలకు పిలవకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సిబ్బంది న్యాయమైన డిమాండ్ల సాధనకు సమ్మె చేస్తుంటే మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ చర్చల పేరిట కూర్చుని, అవి ప్రారంభించకుండానే వెనుదిరగడం దారుణమన్నారు. కార్పొరేషన్‌లో ఔట్‌సోర్సింగ్ సిబ్బందే రెగ్యులర్ సిబ్బంది కంటే ఎక్కువగా ఉన్నారని, వర్క్‌లోడ్ కూడా వీరిపైనే ఉందని, అటువంటి వారి సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం కూడా ఉందన్నారు. స్థానికంగా సిబ్బంది సమ్మెలో ఉంటే వచ్చిన నష్టమేమీలేదని సంబంధిత మున్సిపల్ కమిషనర్లు ప్రభుత్వానికి నివేదించడం వల్లే చర్చలు జరగడంలేదన్నారు. శ్రీకాకుళం కార్పొరేషన్‌కు ప్రత్యేకాధికారిగా కలెక్టర్ ఉన్నందున ఇక్కడి సమస్యలను రాష్ట్ర కమిషనర్ వివరించి ఉండాల్సిందని, ఇప్పటికే నగరంలో వీధిలైట్లు వెలగడంలేదని, తరచూ తాగునీటి సరఫరాకు అంతరాయాలు ఏర్పడుతున్నాయని, మరికొంత కాలం సమ్మె కొనసాగితే నగరం అస్తవ్యస్తమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, సమ్మెకు వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆర్యవైశ్య అధ్యయన కమిటీ అధ్యక్షుడు మండవిల్లి రవి, మహిళా విభాగం నాయకురాలు టి.కామేశ్వరి, మాజీ కౌన్సిలర్ పిల్లల నీలాద్రి, సాధు వైకుంఠరావు, ఎం.ఎ.బేగ్, గద్ది బోయిన కృష్ణయాదవ్, దండి రంగాజీదేవ్, తోట తారక్‌నాథ్, అలపాన త్రినాథ్‌రెడ్డి, మధు తదితరులు సంఘీభావం తెలిపారు.

లిఖితపూర్వకంగా ఇస్తేనే విధుల్లోకి..

నిరవధిక సమ్మె నిర్వహిస్తున్న సిబ్బంది వద్దకు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.డి ప్రసాదరావు వచ్చి మాట్లాడారు. విధుల్లోకి రావాలని కోరగా వర్కర్లు నిరాకరించారు. ప్రభుత్వం బృందాన్ని ఏర్పాటుచేసిందని, సమస్యలు పరిష్కరిస్తామని, విధుల్లో చేరాలని కోరారు. దీనిపై వర్కర్లు స్పందిస్తూ తమ డిమాండ్లపై లిఖితపూర్వకంగా హామీనిస్తే తప్ప తాము విధుల్లో చేరబోమని కార్మికులంతా ముక్తకంఠంతో తేల్చిచెప్పారు. అనంతరం సమ్మె కొనసాగించారు. దీంతో కార్పొరేషన్ కమిషనర్ వెళ్లిపోయారు.

అధినేతతో యువజన నాయకులు




వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో గుండ హరీష్, దన్నాన హరి, పిన్నింటి సత్యంనాయుడు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ)/రణస్థలం: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ యువజన విభాగం శ్రీకాకుళం నియోజకవర్గ అధ్యక్షుడు గుండ హరీష్(కిష్టప్పపేట), ఎచ్చెర్ల నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు దన్నాన హరి(తెప్పలవలస), రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పిన్నింటి సత్యంనాయుడు(జె.ఆర్.పురం) మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కలిశారు. వీరంతా యువజన విభాగ సమావేశానికి హాజరుకాగా.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశా నిర్దేశం చేశారు.

పొంచి ఉన్న ప్రమాదం



టి.డి.వలస బీసీ కాలనీ ప్రధాన రహదారిలో కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. రెండు చోట్ల భారీగా గోతులు ఏర్పడటంతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టు పనులు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు. – జి.సిగడాం

వారాహి అమ్మవారికి ద్వాదశ హారతులు



బలగ నాగావళి తీరాన ఉన్న బాలాత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో జరుగుతున్న వారాహి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం పుష్పాభిషేకం జరిగింది. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు, అభిషేకాలు, యంత్రపూజలు నిర్వహించారు. అనంతరం ద్వాదశ హారతులు ఇచ్చారు. భక్తులు పాల్గొన్నారు. – శ్రీకాకుళం కల్చరల్

వైద్యులు ప్రత్యక్ష దైవాలతో సమానం


వైద్యులను సత్కరిస్తున్న హర్షవల్లి లయన్స్ క్లబ్ ప్రతినిధులు


వైద్యులు, చార్టర్డ్ అకౌంటెంట్లను సన్మానిస్తున్న రోటరీక్లబ్ ప్రతినిధులు


డాక్టర్లు, సీఏలను సన్మానిస్తున్న క్లబ్ ప్రతినిధులు


వైద్యులను సంప్రదిస్తున్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు

శ్రీకాకుళం/శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైద్య రంగంలో ఉంటూనే సేవా రంగంలో తమదైన శైలిలో ప్రజలకు సేవలు అందించడం అభినందనీయమని హర్షవల్లి లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు వి.జగన్నాథనాయుడు అన్నారు. జాతీయ వైద్య దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళంలోని ఓ హోటల్‌లో హర్షవల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలువురు వైద్యులను మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు కింజరాపు అమ్మన్నాయుడు, కె.శోభారాణి, హరికా ప్రసాద్, పార్వతీశ్వరరావు, లక్ష్మణరావు, టి.అప్పలనాయుడు, మణిశర్మ, లక్ష్మీకాంత్, నిహార్, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ సనపల నరసింహమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్య దంపతులు కె.సి.చంద్రానాయక్ డి.పార్వతి, ఎ.పి.ప్రసాద్ కె.మాధురీదేవి, ఎం.శ్రీకాంత్ టి.శశికళ, కె.సునీల్‌నాయక్ ఎస్.విజయలను సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్లు విజయ్‌కుమార్, ప్రసన్నకుమార్, అమ్మన్నాయుడు, రవితేజ, సుజీత తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: సమాజంలో వైద్య వృత్తి పవిత్రమైనదని రోటరీక్లబ్ ఆఫ్ శ్రీకాకుళం అధ్యక్ష, కార్యదర్శులు కె.ఎస్.వి.దుర్గారావు, కె.నాగేశ్వరరావు అన్నారు. డాక్టర్స్ డే సందర్భంగా శ్రీకాకుళం రోటరీక్లబ్ కార్యాలయంలో డాక్టర్స్ డే, చార్టర్డ్ అకౌంటెంట్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు కె.సోమేశ్వరరావు, కె.దిలీప్‌కుమార్, ప్రాచి విలేకర్, వి.బాలరాజు, డా.రవీంద్రనందన్, చార్టర్డ్ అకౌంటెంట్లు బి.శ్రీరామ్మూర్తి, ఎల్.కె.రావు, కె.వి.గురునాథరావు, ఎల్.వి.సచ్చిదానంద, బి.కృష్ణచైతన్యలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ ప్రతినిధులు కొండబాబు, ఎస్.నరసింహమూర్తి, బి.భరత్‌భూషణ్, జి.కన్నబాబు, కెవి రమేష్, కోరాడ వైకుంఠరావు, పాట్నూరు శ్రీనివాసరావు, జయరాం, బి.సురేష్, మండా నాగేశ్వరరావు పాల్గొన్నారు..

శ్రీకాకుళం అర్బన్: జాతీయ వైద్యుల దినోత్సవం, చార్టర్డ్ అకౌంటెంట్ల దినోత్సవం పురస్కరించుకుని లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీకాకుళంలోని ఓ హోటల్‌లో ప్రముఖ వైద్యులు కనుగుల సుధీర్, పైడి మహేశ్వరరావు, ముద్దాడ కనకప్రసాద్, విజయహర్ష, చార్టర్డ్ అకౌంటెంట్లు ఐ.కె.రావు, వి.ఎం.రావు తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బగాది జగన్మోహనరావు, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.